

యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, పట్నం మహేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్



కేసీఆర్‌ను పరామర్శిస్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

# సమన్వయంతో ముందుకెళ్లాలి

• ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి

ఆమనగల్లు(మాడ్గుల), డిసెంబర్ 12 : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఎంపీపీ పద్మారెడ్డి అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయా గ్రామాల సమస్యలను సభలో ప్రజాప్రతినిధులు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, సింగిల్ విండో చైర్మన్ తిరుమల్ రెడ్డి, ఎంపీటీసీలు ఏమి రెడ్డి జైపాల్ రెడ్డి, బట్టు కిషన్ రెడ్డి, పులికంటి లక్ష్మి, భారతి, నారమ్మ, కొత్త పాండు, గ్యార వెంకటయ్య , ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి, మండల వ్యవసాయ అధికారి గౌతమ్, మండల విద్యాధికారి సర్దార్ నాయక్, మండల అన్ని శాఖల ఏఈలు , సర్పంచ్‌లు రామేశ్వర్ రెడ్డి, ఏర్పుల జంగయ్య, హన్మ తదితరులు పాల్గొన్నారు.

## తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి




మండల కేంద్రంలోని తపాలా కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామీణ ప్రాంత తపాలా ఉద్యోగులు

కడ్తాల్, డిసెంబర్ 12 : గ్రామీణ ప్రాంత తపాలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని గ్రామీణ డాక్‌సేవక్స్ యూనియన్ వనపర్తి డివిజన్ కార్యదర్శి రవీందర్ అన్నారు. తపాల ఆలిండియా గ్రామీణ డాక్‌సేవక్స్ యూనియన్ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలో తపాల ఉద్యోగులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎనిమిది గంటల పని సమయాన్ని నిర్ణయించి పెన్షన్‌తోపాటు అన్ని రకాల ప్రయోజనాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాజేశ్‌కుమార్‌రెడ్డి, అశ్విని, యాదయ్య, జంగయ్య, రజిత, రమేశ్, జంగయ్య పాల్గొన్నారు.

## ఘనంగా కొండా వెంకట రంగారెడ్డి జయంతి



కొండా వెంకట రంగారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్లటౌన్, డిసెంబర్ 12: స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి ఏపీ మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకటరంగారెడ్డి 133వ జయంతిని ఘనంగా నిర్వహించారు. చేవెళ్లలోని షాబాద్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి కొండారంగారెడ్డి మనుమడు, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండా రంగారెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సహస్ర లింగార్చన



పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 12: కార్తిక మాసం చివరి రోజు సోమవారం అర్ధరాత్రి వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని లలిత భువనేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సహస్ర లింగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పుట్టమన్నుతో వెయ్యి లింగాలను రూపొందించి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రత్యేకంగా ఆకట్టుకున్నది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మహేందర్ పాల్గొన్నారు.

## విచారణకు రండి

• హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లా కలెక్టర్లు, జీహెచ్ ఎంసీ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ప్రధాన చెరువుల ఆక్రమణపై తదుపరి విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని ఆ రెండు జిల్లాల కలెక్టర్లు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. చెరువు నీటి నిల్వ పూర్తి సామర్థ్యం, సరిహద్దులు నిర్ణయించి రాళ్లు ఏర్పాటు చేయాలని పదేండ్ల కిత్రం ఆదేశాలు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉమ్మడిగా సర్వే చేసి స్థాయి నివేదిక అందజేయాలన్న ఉత్తర్వులు ఇప్పటివరకు అమలు చేయలేదని తప్పుబట్టింది. తదుపరి విచారణలోగా నివేదిక అందజేయాలని, విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని దుర్గంచెరువు, సున్నం చెరువు, ఫిర్జాదిగూడ పెద్ద చెరువు, చిన్న దామర చెరువు, చిన్న రాయుని చెరువు, నల్ల చెరువు.. ఇలా పలు చెరువులను ఆక్రమించి ఆక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని మాదాపూర్‌కు చెందిన అనిల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆక్రమణలు జరుగకుండా చర్యలు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది.

## శమరిమలకు 22 ప్రత్యేక రైళ్లు

ఈ నెల 27 నుంచి రైళ్ల రాకపోకలు..

సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : శమరిమలకు వెళ్లే భక్తుల కోసం 22 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తూ మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సికింద్రాబాద్– కొల్లం, కాకినాడ– కొట్టాయం, సికింద్రాబాద్– కొట్టాయం, రైల్వే స్టేషన్ల మధ్య ఈ నెల 27 నుంచి జనవరి 15 వరకు ప్రత్యేక రైళ్లు రాకపోకలు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

## రసాయన శాస్త్రంలో డాక్టరేట్



డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న అశ్విని

మొయినాబాద్, డిసెంబర్ 12 : మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో ఉన్న చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న అశ్విని నాగరాజుకు డాక్టరేట్ లభించింది. రసాయన శాస్త్రంలో సింథసిస్ ఆఫ్ సమ్ న్యూ ఫైవ్ మెంబర్డ్ హెటిరోసైక్లిక్ డెరివేటివ్స్ అండ్ దెయిర్ యాంటీ క్యాన్సర్ ఎవల్యూయేషన్ అను పరిశోధన అంశంపై ఆచార్య రవీందర్ పర్యవేక్షణలో డాక్టరేట్ ప్రదానం చేశారు. యూనివర్సిటీ కులపతి సీహెచ్ పురుషోత్తంరెడ్డి చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ స్వాతికారెడ్డి అభినందించారు.

# కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

• జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

యాలాల, డిసెంబర్ 12 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. మంగళవారం తాండూరు ఆర్డీవో శ్రీనివాస రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, యాలాల తహసీల్దార్ మునీర్‌లతో కలిసి యాలాల, బెన్నూర్ వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ. 2203, సాధారణ రకానికి రూ.2183 చొప్పున మద్దతు ధరను చెల్లించనున్నట్లు తెలిపారు. రైతులు తప్పని సరిగా నాణ్యతా ప్రమాణాలను పాటించి, తేమ శాతం 17 శాతం తగ్గకుండా ధాన్యం ఉండాలన్నారు.

## నిర్భయంగా షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయండి

• రాచకొండ షీ టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఉషా విశ్వనాథ్

సిటీబ్యూరో, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఆకతాయిల బెదిరింపులకు భయపడకుండా ధైర్యంగా ముందుకొచ్చి షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని రాచకొండ మహిళా భద్రత డీసీపీ ఉషా విశ్వనాథ్ తెలిపారు. 15 రోజుల్లో 117 మంది ఆకతాయిలను వివిధ ఘటనల్లో పట్టుకున్నామన్నారు. వారికి మంగళవారం ఎల్బీనగర్‌లోని రాచకొండ క్యాంప్ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశం ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. షీ టీమ్స్ 24/7 అందుబాటులో ఉంటాయని డీసీపీ తెలిపారు.

## సదరం క్యాంపు కోసం వినతి



పీడీకి వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రధాన కార్యదర్శి గోవర్ధన్

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 12: దివ్యాంగుల సదరం క్యాంపులను తక్షణమే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమండ్ల గోవర్ధన్ డిమాండ్ చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్డీ పీడీ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కారణంగా కోడ్ ఉండటంతో సదరం క్యాంపులను నిలిపేశారని తెలిపారు. రెండు నెలలుగా సదరం క్యాంపులు పెట్టకపోవడం సరికాదన్నారు. తక్షణమే స్లాట్లు రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాణా ప్రణీత్‌సింగ్, రాములు, కృష్ణ పాల్గొన్నారు.

## ఈ నెల 15 నుంచి కరెన్సీ ప్రదర్శన

హిమాయత్‌నగర్, డిసెంబర్ 12: ఆనాటి చరిత్ర, పురాతన అంశాలు, పూర్వీకుల జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు రెడ్డిహిల్స్‌లోని ఫ్యాప్సీ భవన్‌లో స్టాంపులు, నాణేలు, కాగితపు కరెన్సీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ది హైదరాబాద్ ఫిలాటెలిక్ అండ్ హాబీస్ సొసైటీ రాష్ట్ర కార్య దర్శి సాగి శ్రీనివాస్ రాజు తెలిపారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1962లో ఏర్పడిన ఈ సంస్థ అత్యంత ప్రజాదరణ పొందిన స్టాంప్‌లు, నాణేలను సేకరించి అభిరుచి కలిగిన ఎంతో మందిని ఒక వేదిక పైకి తీసుకురావడం జరుగుతున్నదని తెలిపారు.